


జన వెలుగు
సత్యం.. సమాజం.. | తెలుగు దినపత్రిక.

సంపుటి :01 సంచిక :364 వెల.1 రూ /- తేదీ : 26- 10 - 2026,సోమవారం,పేజీలు : 04,

## గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలి‘



- రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, ప్రధాని మోదీ లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పించారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే.
- బంగాల్, హరియాణా, బిహార్, మహారాష్ట్రలో ‘ఓట్ల చోరీ‘ ద్వారా ప్రభుత్వాలను ఏర్పాటు చేశారని ఆరోపించారు.

### నమో ఘాట్ లో ఎయిర్ షో- విన్యాసాలను

## వీక్షించిన ప్రధాని మోదీ

- ఉత్తర్‌ప్రదేశ్ వారణాసిలో భారత వాయుసేన 94వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన వైమానిక ప్రదర్శన ముగిసింది.
- నమో ఘాట్ వద్ద జరిగిన ముగింపు వేడుకలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు.



ఢిల్లి : భారత వాయుసేన 94వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తర్‌ప్రదేశ్ వారణాసిలో వైమానిక ప్రదర్శన చేపట్టింది. నమో ఘాట్ వద్ద జరిగిన ముగింపు వేడుకలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఆయన వెంట రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూపీ గవర్నర్ ఆనందీ బెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. ఈ సందర్భంగా వాయుసేన చేపట్టిన విన్యాసాలను మోదీ వీక్షించారు. గంగానది తీరాన భారత యుద్ధ విమానాలు చేసిన విన్యాసాలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. మిగతా..2లో

### ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు..

## ప్రేక్షకుల మాదిరి చూస్తూ ఊరుకోం

- ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల మధ్య యుద్ధాలు, ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.
- ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం కారణంగా పశ్చిమాసియా రణరంగంగా మారింది.



ఢిల్లి : ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు నెలకున్నాయి. అటు రష్యా- ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లకు పైగా యుద్ధం జరుగుతూనే ఉంది. ఇక భారత్ - పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు సౌదీ అరేబియాపై ఇటీవల హౌతీ దళాల దాడులు తీవ్రతరం అయ్యాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, ఘర్షణలకు చర్చలు, మిగతా..2లో

### అధిష్ఠానం పిలుపు..

## ఢిల్లీకి తెలంగాణ బీజేపీ నేతలు



- తెలంగాణలోని బీజేపీ కీలక నేతలకు పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది.
- ఈ నేపథ్యంలో ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్‌లు హుటాహుటిన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

హైదరాబాద్, అక్టోబర్ 25: తెలంగాణలోని బీజేపీ కీలక నేతలకు పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్‌లు హుటాహుటిన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతోపాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో వారు వేర్వేరుగా సమావేశం కానున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలో చేపట్టనున్న కార్యక్రమాలు.. లోక్ తంత్ర్ బచావో ... అరాచక్ హటావో కార్యక్రమం, పార్టీ సంస్థాగత మార్పులు,

## తుమ్మిడిహట్టి కోసం ముంబైకు రేవంత్

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో దశాబ్దాలుగా నలుగుతున్న కీలకమైన తుమ్మిడిహట్టి ప్రాజెక్టు సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం మహారాష్ట్ర వెళ్తోంది.



హైదరాబాద్ : హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ముంబై వెళ్లనున్న ముఖ్యమంత్రి, రాత్రికి ముంబైలోనే బస చేయనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగునీరు అందించే అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టుపై మహారాష్ట్ర ప్రభుత్వంతో ఉన్న అంతర్రాష్ట్ర జల వివాదాలు, ముంపు సమస్యలను ముఖాముఖి చర్చించి ఒక స్పష్టమైన కొలిక్కి తీసుకురావడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

### సహ్యాద్రి గెస్ట్ హౌస్‌లో ముఖ్యమంత్రుల భేటీ

మంత్రి ఉత్తమ్‌తో పాటు ఉన్నతాధికారుల బృందం రేపు ఉదయం 11 గంటలకు ముంబైలోని ప్రతిష్టాత్మక సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్ లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందం సమావేశం కానుంది. ఈ అత్యున్నత స్థాయి భేటీలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈఎన్‌సీలు , సీడబ్ల్యూసీ ప్రతినిధులు పాల్గొననున్నారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి లభ్యత, తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం, మహారాష్ట్ర వైపు ముంపునకు గురయ్యే భూములు మరియు పరిహారం అంశాలపై సవివరమైన ప్రజెంటేషన్‌ను తెలంగాణ బృందం సిద్ధం చేసింది.

### ప్రాజెక్టు డిజైన్, ముంపు పరిమితిపై సుదీర్ఘ చర్చలు

గతంలో ప్రతిపాదించిన 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే తమ వైపు భారీగా అటవీ, వ్యవసాయ భూములు ముంపునకు గురవుతాయని మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దాంతో ప్రాజెక్టు రూపురేఖలు మారడమే కాకుండా ఉమ్మడి జిల్లాకు జలాలు అందడంలో తీవ్ర జాప్యం జరిగింది.

### ఐటీ కంపెనీల్లో కన్నడిగులకే

## పాధాన్యం ఇవ్వాలి



బెంగళూరులోని ఐటీ సంస్థల్లో స్థానిక కన్నడిగులకు ఉద్యోగ అవకాశాలు లభించడం లేదనే ఫిర్యాదులపై కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ తీవ్రంగా స్పందించారు.

హైదరాబాద్ : ఐటీ కంపెనీలలో స్థానికులను పక్కన పెడుతున్నారనే అంశాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించిందని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటకలో కన్నడిగుడే సర్వాధికారి.. ఏ కారణం చేతనైనా కన్నడిగుల హక్కులు, ఆత్మగౌరవం, ఉద్యోగ అవకాశాలను కాలరాసే ప్రయత్నాలను ప్రభుత్వం సహించదు అంటూ ఎక్స్ వేదికగా ఆయన చేసిన హెచ్చరికలు ప్రస్తుతం కన్నడ నాట హాటా ట్పిక్ అవుతోంది.

## భోగాపురం నుంచి ఢిల్లీకి ఆకాశ ఎయిర్‌లైన్స్ సేవల ప్రారంభం



భోగాపురం నుంచి ఢిల్లీకి ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి.

మూడేళ్ల విరామం తర్వాత ప్రారంభమైన ఈ సేవల్లో భాగంగా తొలి విమానం ప్రయాణికులతో ఢిల్లీకి బయల్దేరింది.

విజయనగరం, అక్టోబర్ 25: విజయనగరం జిల్లాలోని భోగాపురం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. మూడేళ్ల విరామం తర్వాత ఈ సేవలు అందుబాటులోకి రావడంతో విమాన ప్రయాణికుల్లో ఆసక్తి నెలకొంది. ఢిల్లీకి వెళ్లే ప్రయాణికులతో తొలి విమానం బయల్దేరింది. ఈ సర్వీసుల ప్రారంభంతో భోగాపురం నుంచి ఢిల్లీకి ప్రయాణించాలనుకునే వారికి విమానయాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. మిగతా..2లో

## తిరుమలలో మళ్లీ పెరిగిన భక్తుల రద్దీ



సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం

నిన్న ఒక్కరోజే రూ. 3.57 కోట్ల హుండీ ఆదాయం

తిరుపతి : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. వారాంతపు సెలవుల నేపథ్యంలో శనివారం నుంచి తిరుమల కొండపై భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం టోకెన్లు లేని భక్తులకు స్వామివారి సర్వదర్శనం కోసం సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు వెలుపల ఉన్న శిలాతోరణం వరకు విస్తరించాయి. వారాంతం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మిగతా..2లో

### ఇప్పుడు స్థానిక ఎన్నికల పేరుమీద జరుగుతున్నది గ్యాంగ్ వార్ మాత్రమే



- రెండు కుటుంబాలకు చెందిన గ్యాంగులు రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నాయన్న విజయసాయి
- అధికార పార్టీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు నామినేషన్లు చించేస్తున్నారని ఆరోపణ
- 2021 నాటి వైసీపీ అరాచకం కంటే పదింతల అరాచకం ఇప్పుడుందని విమర్శలు
- రాష్ట్ర అభివృద్ధికి మూడో రాజకీయ ప్రత్యామ్నాయమే పరిష్కారమని పునరుద్ఘాటన

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో జరుగుతున్నది ఎన్నికలు కాదని, కేవలం గ్యాంగ్ వార్ మాత్రమేనని ఆయన ధ్వజమెత్తారు.

### ఏపీకి ‘అర్ణబ్’ తుపాను ముప్పు..

## యంత్రాంగం ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలి

- ‘అర్ణబ్’ తుపాను నేపథ్యంలో ఏపీకి హెచ్చరిక
- వచ్చే ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి ఆదేశం
- కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- బుధవారం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటనున్న తుపాను
- ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత విజ్ఞప్తి



అమరావతి : ఏపీకి ‘అర్ణబ్’ తుపాను ముప్పు పొంచి ఉన్నందున రాష్ట్ర యంత్రాంగం రాబోయే ఐదు రోజుల పాటు పూర్తి అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. రేపటి నుంచి కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. అమరావతిలో మాట్లాడిన మంత్రి అనిత.. తుపాను తీరుతెన్నులను వివరించారు. ఈ తుపాను బుధవారం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు. మంగళ, బుధవారాల్లో వర్షాల తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదకరమైన హోర్డింగులను వెంటనే తొలగించాలని, తీరప్రాంత ప్రజలను అవసరమైతే మిగతా..2లో

### విశాఖకు 870 కి.మీ దూరంలో తీవ్ర వాయుగుండం..

## ఐఎండీ అప్ డేట్

- బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం
- దశలవారీగా బలపడి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం
- అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే సూచన
- గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని అంచనా
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ప్రభుత్వం హెచ్చరిక



అమరావతి : ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది దశలవారీగా బలపడి “అతి తీవ్ర తుపాను“గా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొచ్చే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ (×వీణ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 28వ తేదీ ఉదయం బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే సూచనలు ఉన్నాయని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలకు ఆరెంజ్ మెసేజ్ జారీ చేసింది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ప్రచండ గాలులు వీచే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మిగతా..2లో

జన వెలుగు
సత్యం.. సమాజం.. | తెలుగు దినపత్రిక.

మొదటి పేజీ తరువాయి

## ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు..
## యంత్రాంగం ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలి

సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, పర్యాటకులను బీచ్‌లకు అనుమతించవద్దని స్పష్టం చేశారు. రైతులు, సాధారణ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి విజ్ఞప్తి చేశారు. సముద్రపు అలల వద్ద సెల్ఫీలు వంటి సాహసాలు చేయవద్దని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, కేవలం విపత్తుల నిర్వహణ సంస్థ జారీచేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు.

## ఇప్పుడు స్థానిక ఎన్నికల పేరుమీద
## జరుగుతున్నది గ్యాంగ్ వార్ మాత్రమే

రెండు కుటుంబాలకు చెందిన గ్యాంగులు రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల పేరుమీద జరుగుతున్నది గ్యాంగ్ వార్ మాత్రమే. బీహార్‌ను మించి పోయి, రెండు కుటుంబాలకు చెందిన ఒక హిందూ కుల గ్యాంగ్, మరో మైనారిటీ మతానికి చెందిన గ్యాంగ్‌లు మన రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నాయి" అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు కుటుంబ గ్యాంగులకు అధికారం దక్కకుండా చేస్తే తప్ప ఏపీలో ప్రజలకు రక్షణ ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రానికి అభివృద్ధి కేవలం మూడవ ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ వలనే సాధ్యమవుతుందని, అదే ఏపీకి శరణ్యమని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "అధికార పార్టీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు.. ఈ ముగ్గురు కలిసి ఒక కూటమిగా ఏర్పడి, స్థానిక ఎన్నికల్లో పోటీపడి నామినేషన్లు చించేస్తున్నారు" అని విమర్శించారు. 2021లో వైసీపీ చేసిన అరాచకం కంటే పదింతలు ఎక్కువ అరాచకం ఈ రోజు స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు.

### భోగాపురం నుంచి ఢిల్లీకి ఆకాశ ఎయిర్‌లైన్స్ సేవల ప్రారంభం

రాజధానికి వెళ్లే వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఈ విమాన సేవలు ఉపయోగకరంగా మారనున్నాయి. విమాన ప్రయాణం ద్వారా సమయం ఆదా చేసుకోవడంతో పాటు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వివిధ పనుల నిమిత్తం తరచూ ఢిల్లీకి వెళ్లేవారికి ఈ సర్వీసులు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీసుల ప్రారంభంతో భోగాపురం నుంచి విమాన ప్రయాణాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడనుంది. ఢిల్లీ వంటి ప్రధాన నగరానికి నేరుగా విమాన సదుపాయం అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణికులు తమ అవసరాలకు అనుగుణంగా ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవచ్చు. వ్యాపార సమావేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు, విద్యా సంబంధిత అవసరాలు, వ్యక్తిగత పర్యటనల కోసం ఢిల్లీ వెళ్లేవారికి ఈ సేవలు తోడ్పడనున్నాయి. విమాన సర్వీసుల నిర్వహణ, ప్రయాణ సమయాలు, టికెట్ ధరలు, రాకపోకల షెడ్యూల్ వంటి వివరాలు ప్రయాణికులకు కీలకం కానున్నాయి. మూడేళ్ల విరామం తర్వాత విమాన సేవలు తిరిగి ప్రారంభం కావడంతో భోగాపురం నుంచి ఢిల్లీకి ప్రయాణించే వారి అవసరాలకు అనుగుణంగా ఈ సర్వీసులు ఎంతమేరకు ఉపయోగపడతాయన్నది ఆసక్తికరంగా మారింది.

## తుమ్మిడిహట్టి కోసం ముంబైకు రేవంత్

మహారాష్ట్రకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, సాంకేతికంగా సరికొత్త ప్రత్యామ్నాయ డిజైన్లతో నీటిని మళ్లించే ప్రతిపాదనలను రేవంత్ రెడ్డి సర్కారు రూపొందించింది. రేపటి భేటీలో ఈ కొత్త ప్రతిపాదనలను ఫడ్నవీస్ ముందు ఉంచి వారి ఆమోదం పొందేందుకు రేవంత్ టీమ్ గట్టి ప్రయత్నాలు చేయనుంది.

### రాజకీయంగా, ప్రాంతీయంగా ప్రాధాన్యత ఉన్న పర్యటన

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగు రాష్ట్రాలతో సఖ్యతగా ఉంటూ జల వివాదాలను పరిష్కరించుకోవాలనే నూతన వ్యూహంతో ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలో మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంతో జరిపే ఈ భేటీకి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు సాకారమైతే ఉత్తర తెలంగాణలోని వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి వచ్చినట్లే.

## తిరుమలలో మళ్లీ పెరిగిన భక్తుల రద్దీ

కాగా, నిన్న (శనివారం) ఒక్కరోజే 81,768 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వీరిలో 34,018 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.57 కోట్లుగా నమోదైనట్లు టీటీడీ పేర్కొంది.

## అధిష్ఠానం పిలుపు.. ఢిల్లీకి తెలంగాణ బీజేపీ నేతలు

రాష్ట్ర రాజకీయ పరిణామాలతోపాటు స్థానికంగా పార్టీ మరింత బలోపేతం కావడం కోసం అనుసరించాల్సిన వ్యూహంపై తెలంగాణ నేతలకు వారు దిశ నిర్దేశం చేయనున్నారని సమాచారం. అదీకాక తెలంగాణలో రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందుకోసం గ్రామ స్థాయిలో పార్టీని పటిష్ఠ పరిచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇక నవంబర్‌లో అమిత్ షా, డిసెంబర్‌లో ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారని సమాచారం. ఇప్పటికే ఉత్తర తెలంగాణలో బీజేపీ బలంగా ఉంది. అలాగే మిగిలిన ప్రాంతంలో కూడా పార్టీని మరింత బలోపేతం చేయడం ద్వారా అధికారం అందుకోవడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ వరుసగా రెండో సారి అధికారం అందుకోవాలని ఆలోచనతో ముందుకు సాగుతోంది. ఇక పదేళ్లు పాలించి.. ప్రస్తుతం ప్రతిపక్షానికి పరిమితమైన బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పూర్వ వైభవం కోసం తన వంతు ప్రయత్నాలు ప్రారంభించింది. అలాంటి వేళ.. రాష్ట్రంలో అధికార పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా బీజేపీ గట్టిగా ప్రయత్నాలు చేస్తోంది.

## 9-12 తరగతులకు ఏఐ పాఠాలు
## డీప్‌ఫేక్‌ల గుర్తింపుపై ప్రత్యేక శిక్షణ సరికొత్త మాడ్యూల్

ఏఐని అర్థం చేసుకోవడానికి మాడ్యూళ్లను ఎన్‌సీఈఆర్ టీ విడుదల చేసింది. విద్యార్థుల కోసం 20 గంటల కంప్యూటేషనల్ థింకింగ్, కృత్రిమ మేధస్సు (ఏఐ) మాడ్యూల్‌ను రూపొందించింది.

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎన్ సీఈఆర్ టీ)కీలక ముందడుగు వేసింది. 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం కంప్యూటేషనల్ థింకింగ్ (సీటీ), కృత్రిమ మేధస్సు (ఏఐ) అంశాలపై 20 గంటల పరిచయ మాడ్యూల్‌ను రూపొందించింది. రోజువారీ జీవితంలో ఏఐ వినియోగం, యంత్రాలు ఉదాహరణల ద్వారా నేర్చుకునే విధానం, డీప్‌ఫేక్‌ల గుర్తింపు, వ్యక్తిగత సమాచార గోప్యత వంటి అంశాలను ఇందులో చేర్చింది. ఆధునిక సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించడంతోపాటు, దాని ద్వారా వచ్చే సమాచారాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించే సామర్థ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఎన్ సీఈఆర్ టీ ఈ విద్యా మాడ్యూల్ ను ఐఐటీ మద్రాసు, ఐఐటీ జోధ్‌పూర్ నిపుణుల సంప్రదింపులతో అభివృద్ధి చేసింది. ఏఐపై గతంలో ఎలాంటి అవగాహన లేని విద్యార్థులు కూడా సులభంగా నేర్చుకునేలా దీనిని రూపొందించారు. కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడమే కాకుండా, సమస్యలను విశ్లేషించడం, పరిష్కారాలను అన్వేషించడం, సృజనాత్మకంగా ఆలోచించడం వంటి నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి సారింటారు.

కంప్యూటేషనల్ థింకింగ్ అంటే ఏమిటి?

సమస్యలను క్రమపద్ధతిలో విశ్లేషించి, వాటిని చిన్న చిన్న భాగాలుగా విభజించి, పరిష్కార మార్గాలను గుర్తించే విధానమే కంప్యూటేషనల్ థింకింగ్. ఈ ఆలోచనా పద్ధతిని విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా క్లిష్టమైన సమస్యలను తార్కికంగా పరిష్కరించే సామర్థ్యం పెరుగుతుందని ఎన్‌సీఈఆర్‌టీ భావిస్తోంది. అదే సమయంలో ఏఐ వ్యవస్థలు ఎలా పనిచేస్తాయి? వాటికి ఎలాంటి సామర్థ్యాలు ఉన్నాయి? ఏ సందర్భాల్లో అవి తప్పులు చేయొచ్చు? అనే అంశాలను విద్యార్థులు తెలుసుకునేలా పాఠ్యాంశాలను రూపొందించారు.

డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారంపై అవగాహన

ప్రస్తుతం ఏఐ సాయంతో నకిలీ చిత్రాలు, వీడియోలు, స్వరాలను సృష్టించడం సులభమవుతోంది. వాస్తవంగా జరగని సంఘటనలు జరిగినట్లుగా చూపించే డీప్‌ఫేక్ కంటెంట్ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో అలాంటి సమాచారాన్ని గుర్తించడం, దాని విశ్వసనీయతను పరిశీలించడం వంటి అంశాలకు కొత్త మాడ్యూల్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. ఏఐ ద్వారా రూపొందించిన సమాచారాన్ని చూసిన వెంటనే నమ్మకుండా, దాని నిజానిజాలను ధ్రువీకరించుకోవాలని విద్యార్థులకు నేర్పించనున్నారు. తప్పుడు సమాచారం ఎలా వ్యాప్తి చెందుతుంది? దాన్ని గుర్తించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే అంశాలను కూడా కార్యకలాపాల ద్వారా వివరించనున్నారు.

వ్యక్తిగత సమాచారం భద్రతకు ప్రాధాన్యం

ఏఐ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వ్యక్తిగత సమాచార గోప్యత, డిజిటల్ భద్రతపై అవగాహన అవసరమని ఎన్‌సీఈఆర్‌టీ పేర్కొంది. విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో పంచుకునేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించడం, డేటాను బాధ్యతాయుతంగా ఉపయోగించడం వంటి అంశాలను ఈ మాడ్యూల్‌లో చేర్చారు. అలాగే ఏఐ వ్యవస్థలు అందించే ఫలితాల్లో పక్షపాత ధోరణులు ఉండే అవకాశాన్ని అర్థం చేసుకోవడం, సమాచారాన్ని సమానత్వ దృక్పథంతో పరిశీలించడం, సాంకేతికతను నైతిక పరిమితులకు లోబడి ఉపయోగించడం వంటి అంశాలపైనా అవగాహన కల్పించనున్నారు.

పరికరాలు లేకున్నా నేర్చుకునే అవకాశం

విద్యార్థులు కేవలం పుస్తకాల్లోని అంశాలను చదివేలా కాకుండా, చర్చలు, ప్రయోగాలు, ప్రాక్టికల్ వ్యాయామాలు, అనుభవాల ఆధారంగా నేర్చుకునే విధానాన్ని ఈ మాడ్యూల్‌లో అనుసరించారు. డిజిటల్ పరికరాలు అందుబాటులో ఉన్నా లేకపోయినా తరగతి గదుల్లో ఈ కార్యకలాపాలను నిర్వహించవచ్చని ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. దీంతో విభిన్న వసతులున్న పాఠశాలల విద్యార్థులకు

## విశాఖకు 870 కి.మీ దూరంలో తీవ్ర వాయుగుండం.. ఐఎండీ అప్ డేట్

మొదటి పేజీ తరువాయి



ఆదివారం ఉదయం 11:30 గంటల సమయానికి ఈ తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 870 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 960 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. అదేవిధంగా, మచిలీపట్నానికి 1,060 కిలోమీటర్లు, బాపట్లకు 1,130 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం గంటకు 5 కిలోమీటర్ల నెమ్మది వేగంతో నైరుతి దిశగా కదులుతున్న ఈ వ్యవస్థ, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి తుపానుగా మారనుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ తుపాను అక్టోబర్ 27 ఉదయానికి తీవ్ర తుపానుగా, అక్టోబర్ 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి, ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి రానుంది. అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నంలోపు బాపట్ల-విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలు, ముఖ్యంగా తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వేటకు వెళ్లిన వారుంటే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని కోరింది. "బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో జాగ్రత్తగా కట్టి ఉంచాలి. సముద్ర తీరాల్లో అలల ఉధృతి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, బీచ్‌ల వద్ద సెల్ఫీలు దిగే ప్రయత్నం చేయరాదు" అని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. తుపాను కదలికలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని, ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల సహాయక చర్యలకు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. తీరప్రాంత జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు.. ప్రేక్షకుల మాదిరి చూస్తూ ఊరుకోం: జైశంకర్ షాకింగ్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి



దౌత్య విధానమే మార్గమని పిలుపునిచ్చారు. యూఎన్ డే సందర్భంగా చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళన్ లో భాగంగా జై శంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాలపై కీలక కామెంట్స్ చేశారు. "ఈరోజు దేశంలో రెండు అతిపెద్ద యుద్ధాలు జరుగుతున్నాయి. ఉక్రెయిన్ అలాగే పశ్చిమాసియాలో యుద్ధం. ఈ యుద్ధాల కారణంగా సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు అలాగే ఈ ఘర్షణలకు ఎక్కడో దూరంగా ఉన్న ప్రజలపైనా ధరలు పెరుగుదలతో ఈ యుద్ధ ప్రభావం పడుతోంది. ఈ ఘర్షణల కారణంగా నిజమైన మూల్యాన్ని చెల్లించుకుంటుంది వాళ్లే. మనం ఈ ఘర్షణల్లో ప్రేక్షకుల మాదిరిగా ఉండకూడదు. ఈ ఘర్షణలు కేవలం దౌత్యం, చర్చల ద్వారానే ముగుస్తాయని భారత్ భావిస్తోంది. ఈ మేరకు శాంతి కోసం ఆ దేశాలకు సహకారం అందించేందుకు భారత్ తమ వంతు కృషి చేసేందుకు సిద్ధంగా ఉంది" అని జై శంకర్ స్పష్టం చేశారు. అలాగే టెర్రరిజం పైనా జై శంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ శాంతికి నిజమైన విఘాతం ఉగ్రవాదం అని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎప్పటికీ ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎప్పటికప్పుడు కూల్చివేసేందుకు ప్రపంచ దేశాలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇక గతేడాది జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో పాకిస్థాన్ కు చెందిన ఉగ్రమూకలు దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది.

## నమో ఘాట్ లో ఎయిర్ షో- విన్యాసాలను వీక్షించిన ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

సుఖోయ్, తేజస్ యుద్ధవిమానాలు సహా పలు హెలికాప్టర్లు తమ సత్తా చాటాయి. మూడు కిరణ్ విమానాలు వీ ఆకారంలో త్రివర్ణ పతాక రంగులను గగనతలంలో వెదజల్లుతూ దూసుకెళ్లగా, హెలికాప్టర్లు ఓంకార్ ఆకృతిలో కనువిందు చేశాయి. సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం, సారంగ్ హెలికాప్టర్ల బృందం చేసిన సాహసోపేత విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన రఫేల్ యుద్ధవిమానాలు కూడా విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఇంకా ఈ ప్రదర్శనలో తేజస్, లైట్ కాంబాట్ హెలికాప్టర్ 'ప్రచండ్', వంటి విమానాలతో పాటు, అత్యాధునిక యుద్ధ విమానాలు ప్రదర్శితమయ్యాయి.

### వారణాసిలో ప్రధాని మోదీ రోడ్ షో

అంతకుముందు ప్రధాని మోదీ వారణాసిలో రోడ్ షో నిర్వహించారు. వేలాది మంది స్థానికులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు బీజేపీ జెండాలు, జాతీయ త్రివర్ణ పతాకం, పూలు, సాంప్రదాయ డప్పులతో ఆయనకు స్వాగతం పలికారు. ప్రధానమంత్రి తన వాహనం నుంచి జనసమూహానికి అభివాదం చేయగా, ప్రజలు "హర్ హర్ మహాదేవ్", "జై శ్రీరామ్" అంటూ నినాదాలు చేశారు. ప్రధానమంత్రి మోదీ వారణాసి పోలీస్ లైన్‌కు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నమో ఘాట్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మార్గం పొడవునా ఎనిమిది స్వాగత కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి కేంద్రం వద్ద మహిళలు, ఆ తర్వాత ఇతర బృందాలు ఆయనకు స్వాగతం పలికారు. పోలీస్ లైన్స్ ప్రధాన గేటు, పోలీస్ లైన్స్ క్రాసింగ్, ఖజూరి-మఖ్బూల్ ఆలం రోడ్డులోని యెస్ బ్యాంక్, హుకుల్‌గంజ్ తిరుముహాని, చౌకాఘాట్ కలప మార్కెట్, సిటీ రైల్వే స్టేషన్, గోల్ గడ్డా క్రాసింగ్, రైల్వే అండర్‌పాస్, నమో ఘాట్ సమీపంలోని సీఎన్‌జీ స్టేషన్ వద్ద, అనేక చోట్ల టెంట్లు ఏర్పాటు చేసి ఈ పాయింట్లను నెలకొల్పారు.

### నూతన వస్త్ర పరిశ్రమను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

అటు ఉత్తర్‌ప్రదేశ్ వారణాసిలో ప్రముఖ వస్త్ర తయారీ సంస్థ అరవింద్ లిమిటెడ్ నెలకొల్పిన నూతన వస్త్ర పరిశ్రమను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం పరిశ్రమలో మహిళా కార్మికులతో ప్రధాని ముచ్చటించారు. అత్యాధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన, ఈ నూతన పరిశ్రమ ద్వారా స్థానికంగా పెద్ద ఎత్తున




ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు ఈ ప్రాంత ఆర్థిక ప్రగతికి ఇది ఎంతో దోహదం చేస్తుందని వెల్లడించారు. వారణాసిలో తయారైన దుస్తులను అరవింద్ సంస్థ అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనుందని వివరించారు. అంతకుముందు ప్రధాని మోదీ ఆదివారం ఉదయం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా మిర్జామురాద్‌కు వెళ్లారు.

## గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలి'

మొదటి పేజీ తరువాయి



ఢిల్లి : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేసి, అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కోరారు. గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను "రెండో స్వాతంత్ర్య యుద్ధం"గా అభివర్ణించారు. బంగాల్, హరియాణా, బిహార్, మహారాష్ట్రలో 'ఓట్ల చోరీ' ద్వారా ప్రభుత్వాలను ఏర్పాటు చేశారని, ఈ దొంగలందరినీ జైలుకు పంపిస్తామని అన్నారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి, తమ హక్కుల కోసం పోరాడాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నుంచి ప్రజలకు పారదర్శకత, జవాబుదారీతనం కావాలని పేర్కొన్నారు. బిహార్ తొలి ముఖ్యమంత్రి డాక్టర్ శ్రీ కృష్ణ సింగ్ 139వ జయంతి ఉత్సవాల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీల భావజాలం దేశంలో విభజనలను మరింత తీవ్రతరం చేస్తోందని ఖర్గే ఆరోపించారు. నెహ్రూ సిద్ధాంతాన్ని నిర్మూలించే వరకు దేశంలో శాంతి ఉండదని వ్యాఖ్యానించారు. నీతీష్ కుమార్ వంటి సోషలిస్ట్ నాయకులు, నెహ్రూ సిద్ధాంతాన్ని నమ్మే వ్యక్తులతో చేతులు కలపడం నాకు బాధ కలిగిస్తోందన్నారు. "నేడు మనం ఆర్ఎస్ఎస్ గురించి మాట్లాడితే ప్రజలు దానిని భిన్నంగా అర్థం చేసుకోవచ్చు. ఈ దేశంలో ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నంత కాలం, శాంతి ఉండదు. మేము ఐక్యత, సమానత్వం, రాజ్యాంగాన్ని విశ్వసించే దేశభక్తులం. బీజేపీ నాయకుల్లా రాజకీయ లబ్ధి కోసం మన ప్రజలను విభజించేవాళ్లం కాదు." అని అన్నారు. హల్వానీ 'శుద్ధీకరణ' చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖర్గే డిమాండ్ చేశారు. కుల వివక్ష, వెలివేత వంటివి మానవ గౌరవాన్ని, సమానత్వాన్ని దెబ్బతీస్తాయని ఆయన అన్నారు. దేశంలోని ప్రతి ఆలయంలోకి దళితులు ప్రవేశించేందుకు, అక్కడ పూజలు చేసుకునేందుకు వారికి పూర్తి హక్కు ఉండాలని కాంగ్రెస్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. "మా పోరాటం మతానికి వ్యతిరేకం కాదు. మతం పేరుతో జరిగే వివక్షకు వ్యతిరేకం. నా మతం పట్ల నాకు గర్వం ఉంది. నా పేరు కూడా ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకదాని నుంచి ప్రేరణ పొందిందే. మతం ప్రజలను ఏకం చేయాలి, విభజించకూడదు." అని అన్నారు. అయోధ్యలోని రామమందిరానికి అందిన విరాళాల వివాదంపై బీజేపీని లక్ష్యంగా చేసుకున్నారు ఖర్గే. రాముడు తన కళ్లు తెరిచి, తన పేరుతో సంపదను దోచుకున్న వారికి తగిన శిక్ష విధించాలని ఆయనను ప్రార్థిస్తున్నానని అన్నారు. బిహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, నీటిపారుదల రంగాలను ప్రోత్సహించడం ద్వారా ఆధునిక రాష్ట్రానికి పునాదులు వేయడంలో సహాయపడ్డారని ఖర్గే అన్నారు. "జమీందారీ వ్యవస్థను రద్దు చేసి, బలహీన వర్గాలకు సాధికారత కల్పించడం ద్వారా సింగ్ ఆధునిక బిహార్‌లో ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేశారు. తన వర్గానికి చెందిన వారే అనేకమంది భూస్వాములుగా ఉన్నప్పటికీ, ఆయన దేశానికి, పేదలకు సేవ చేయడానికే కట్టుబడి ఉన్నారు. ఆధునిక బిహార్ నిర్మాతగా ఆయన వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, నీటిపారుదల రంగాలకు గణనీయమైన కృషి చేశారు. బరౌని ఆయిల్ రిఫైనరీ, ఎరువుల కర్మాగారాలు, రాజేంద్ర సేతు వంటి అనేక మైలురాయి ప్రాజెక్టులు ఆయన హయాంలో స్థాపించారు. ఆ సమయంలో చాలా మంది విదేశీ ఆర్థికవేత్తలు బిహార్‌ను దేశంలోనే అత్యుత్తమ పరిపాలన కలిగిన రాష్ట్రంగా పరిగణించారు. ఇప్పుడు అది జంగిల్ రాజ్ లా మారిపోయింది." అని మల్లిఖార్జున ఖర్గే అన్నారు.

## ఐటీ కంపెనీల్లో కన్నడిగులకే ప్రాధాన్యం ఇవ్వాలి: డీకే శివకుమార్

మొదటి పేజీ తరువాయి

### ప్రైవేట్ సంస్థలపై చర్యలకు హెచ్చరిక

బెంగళూరు నగరానికి లభించిన భారతదేశపు సాంకేతిక రాజధాని గుర్తింపు వెనుక స్థానిక కన్నడిగుల ప్రతిభ, నైపుణ్యం , శ్రమ దాగి ఉన్నాయని డి.కె. శివకుమార్ కొనియాడారు. ఐటీ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా మద్దతు ఇస్తున్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ సంస్థలు కావాలని కన్నడిగులను పక్కన పెడుతున్నట్లు తేలితే సదరు సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఘాటైన హెచ్చరికలు జారీ చేశారు. కన్నడిగుల సంక్షేమం, ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే తమ కాంగ్రెస్ ప్రభుత్వం వారి ప్రయోజనాలను కాపాడేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పుకొచ్చారు.

### రిజర్వేషన్ బిల్లు వివాదం

ఈ ట్వీట్ వ్యాఖ్యల వెనుక గత కొన్ని నెలలుగా కర్ణాటకను ఊపేస్తున్న స్థానిక ఉద్యోగాల రిజర్వేషన్ బిల్లు వివాదం ఉంది. ప్రైవేట్ పరిశ్రమల్లో సి-గ్రేడ్, డి-గ్రేడ్ ఉద్యోగాలలో 100%, మేనేజ్‌మెంట్ స్థాయి పోస్టుల్లో 50% నుంచి 70% వరకు స్థానిక కన్నడిగులకే రిజర్వ్ చేయాలని సిద్ధరామయ్య ప్రభుత్వం ప్రతిపాదించిన చట్టం దుమారానికి దారితీసింది. నాస్కామ్ వంటి ఐటీ పరిశ్రమల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు ఈ నిర్ణయం వల్ల బెంగళూరు నుంచి పెట్టుబడులు, గ్లోబల్ టాలెంట్ ఇతర రాష్ట్రాలకు తరలిపోతాయని ఆందోళన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం ఆ బిల్లును తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టింది.

### మళ్లీ తెరపైకి కన్నడ సెంటిమెంట్

ఐటీ కంపెనీల ఒత్తిడితో రిజర్వేషన్ బిల్లును పక్కన పెట్టారంటూ కన్నడ రక్షణ వేదిక వంటి స్థానిక సంఘాల నుంచి తీవ్ర నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, డి.కె. శివకుమార్ చేసిన ఈ ప్రకటనకు



ప్రాధాన్యత ఏర్పడింది. ఒకవైపు అంతర్జాతీయ స్థాయి ఐటీ హబ్‌గా బెంగళూరును నిలబెట్టుకుంటూనే, మరోవైపు కన్నడ ప్రాంతీయ భావోద్వేగాలను, స్థానిక ఉద్యోగావకాశాల నిరసనలను శాంతపరిచేందుకు కాంగ్రెస్ సర్కారు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాబోయే రోజుల్లో ఐటీ కంపెనీల నియామకాలపై ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు తీసుకోనుందోననే ఉత్కంఠ పారిశ్రామిక వర్గాల్లో నెలకొంది.

జన వెలుగు
సత్యం.. సమాజం.. | తెలుగు దినపత్రిక.

# అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గొర్రె థామస్

## - అంబేద్కర్ ఆశయాల సాధనకు అంకితభావంతో కృషి చేస్తా



**ఎల్కతుర్తి అక్టోబర్ 25 జన వెలుగు దినపత్రిక రిపోర్టర్ కొలిపాక శ్రీనివాస్:** తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన గొర్రె థామస్ ఎన్నికయ్యారు ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెల్మకంటి దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో థామస్‌కు నియామక పత్రం అందజేశారు గతంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన థామస్ సంఘ అభివృద్ధికి బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకు అంబేద్కర్ ఆశయాల ప్రచారానికి చేసిన కృషిని గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించారు ఆయన ఎన్నిక పట్ల ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల అంబేద్కర్‌వాదులు ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా గొర్రె థామస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు వెల్మకంటి దయాకర్‌తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానన్నారు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలైన స్వేచ్ఛ సమానత్వం సామాజిక న్యాయం సౌభ్రాతృత్వం సాధనకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.



గతంలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సహకరించిన సంఘ నాయకులు కార్యకర్తలు అంబేద్కర్ అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పారంద స్వామి అధికార ప్రతినిధి ఇసంపెల్లి రమేష్ గౌరవ అధ్యక్షుడు జన్ను నర్సయ్య ముఖ్య సలహాదారు ఇసంపెల్లి నీలయ్య వరంగల్ జిల్లా అధ్యక్షుడు వివేకానంద జంగిలి భాస్కర్ వల్లందాస్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన అక్షిత

## భారత జట్టుకు ఎంపికైన అక్షితను అభినందించిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**చింతపల్లి,అక్టోబర్ 25,జన వెలుగు దినపత్రిక రిపోర్టర్ జె వి ఎస్ :**
చింతపల్లి మండలం చాకలి శేరిపల్లి గ్రామానికి చెందిన అక్షిత జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించడంతో పాటు, భారత జట్టుకు ఎంపికై తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం అక్షితను రమావత్ రవీంద్ర కుమార్ అభినందించారు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో జరిగిన జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున పాల్గొన్న అక్షిత అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించింది. తన ప్రతిభతో జాతీయ స్థాయిలో సత్తా చాటిన ఆమె తాజాగా భారత జట్టుకు ఎంపికైంది.ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.....గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు, అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. అక్షిత తన ప్రతిభతో తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ పోటీల్లోనూ విజయాలు సాధించి మరిన్ని పతకాలు సాధించాలని కోరుతూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.నవంబర్ 19 నుంచి 23 వరకు శ్రీలంకలో జరగనున్న ఆసియన్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో అక్షిత భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించనుందని రవీంద్ర కుమార్ తెలిపారు. ఈ పోటీల్లోనూ అక్షిత ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల శ్రీశైలం, ఉప సర్పంచ్ పగడాల వెంకటయ్య, తండ్రి ఆకుల జగతయ్య ,తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఓటు హక్కుతోనే సమాజ మార్పు

## చింతలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా చిలుముల ప్రమోద్ ఎన్నిక



**ఎల్కతుర్తి అక్టోబర్ 25 జన వెలుగు దినపత్రిక రిపోర్టర్ కొలిపాక శ్రీనివాస్:** సమాజ మార్పుకు విద్య పునాది కాగా రాజకీయాలను శాసించడానికి ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తూముల సదానందం అన్నారు. ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు వెలమకంటి దయాకర్ సూచనల మేరకు ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొర్రె థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తూముల సదానందం మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు ఆలోచనా విధానాలకు అనుగుణంగా సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. దేశ రాజకీయాలను మార్చాలన్నా పాలకులను ప్రశ్నించాలన్నా ఓటు హక్కు కీలకమని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల విద్యార్థులు అంబేద్కర్ ఆలోచనా విధానాలను ఆదర్శంగా తీసుకొని సామాజిక మార్పులో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగంపై సామాజిక బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో బహుజనుల రాజ్యాధికార సాధనలో ఓటు హక్కుకు అంతే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు .రాజకీయ చైతన్యంతో ముందుకు సాగుతూ రాజ్యాధికార సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతులు దేశానికి వెన్నెముకగా నిలుస్తున్నారని యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు .అనంతరం తెలంగాణ అంబేద్కర్ సంఘం ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు బొంకూరి రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో చింతలపల్లి గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా చిలుముల ప్రమోద్ ,ఉపాధ్యక్షుడిగా బొంకూరి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా బొంకూరి చందు, సహాయ కార్యదర్శులుగా చుంచు రాకేష్, చిలుముల అరుణ్ ,గౌరవ అధ్యక్షుడిగా బొంకూరి సదానందం, ముఖ్య సలహాదారుడిగా చిలుముల రమేష్‌ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ,బొంకూరి రవీందర్ ,అడ్డూరి రమేష్, అడ్డూరి ప్రశాంత్, చిలుముల వినోద్ గ్రామానికి చెందిన పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.



# రామాలయంలో వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

## - సూక్ష్మంలో మోక్ష మార్గం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతకల్పం



**నాగర్ కర్నూల్ జిల్లా, అక్టోబర్ 25 జనవెలుగు రమణ :**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను వైభవంగా నిర్వహించారు.రామాలయ ప్రధాన అర్చకులు కందడై వరదరాజన్ అయ్యంగార్ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ జీవితంలో ఆధ్యాత్మిక చింతనకు, మోక్షమార్గ సాధనకు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం ఎంతో విశిష్టమైనదని తెలిపారు.అనంతరం వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు వేద ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. రామాలయ అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో సామూహిక అన్నప్రసాద వితరణ నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కందడై శ్రీనివాసచార్యులు, అర్థం రవీందర్, మల్లేష్, గొల్ల రాములు, రమాదేవి, శారద, శివ, రామాలయ భజన భక్త బృందం, రామాలయ యువతతో పాటు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి

## టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెదక్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి డిమాండ్



**మేడ్చల్,అక్టోబర్ 25,జన వెలుగు దినపత్రిక,రిపోర్టర్ ప్రభాకర్ రెడ్డి :**
రాష్ట్రంలోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయడంతోపాటు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెదక్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి డిమాండ్ చేశారు. ఆదివారం రామాయంపేట పట్టణంలోని ప్రగతి రిసార్టులో నిర్వహించిన రామాయంపేట ప్రెస్ క్లబ్ ఎన్నికల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.జర్నలిస్టులు వృత్తిపరమైన ఒత్తిళ్లతో పాటు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెల్త్ కార్డులు అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా హెల్త్ కార్డుల విషయంలో జాప్యం జరగడం విచారకరమన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రులకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాల తరహాలో 55 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు లేదా 25 ఏళ్లపాటు వృత్తిలో కొనసాగిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే (ఐజేయు) నిరంతరం కృషి చేస్తోందని, జిల్లాలో జర్నలిస్టులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని స్పష్టం చేశారు.

**ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక :**
రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఐదుసార్లు ఎన్నికైన బసన్నపల్లి మల్లేశంను శంకర్ దయాల్ చారి అభినందించారు. ప్రెస్ క్లబ్‌కు జిల్లా కమిటీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల ఐక్యతను కాపాడుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.టీయూడబ్ల్యూజే (ఐజేయు) గ్రామీణ విలేకరుల సంక్షేమ కమిటీ సభ్యుడు కంది శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రామాయంపేట ప్రెస్ క్లబ్‌కు గత 30 ఏళ్లుగా మంచి పేరు ఉందని, ఆ పేరును నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన కార్యవర్గం పనిచేయాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జి. శ్రీనివాస శర్మ మాట్లాడుతూ, ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడం సంతోషకరమని, భవిష్యత్తులోనూ జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

**నూతన కార్యవర్గం వివరాలు:**
– అధ్యక్షుడు: బసన్నపల్లి మల్లేశం (నవతెలంగాణ), ప్రధాన కార్యదర్శి: పతేరి రాము (టీవీ9),కోశాధికారి: రంగ రాజా కిషన్ (దిశ),గౌరవ అధ్యక్షులు: చంద్రపు అమరేందర్ రెడ్డి (సాక్షి), డి.జి. శ్రీనివాస శర్మ (సిరి)
ఉపాధ్యక్షులు: కర్రె నరేందర్ (ఆర్‌టీవీ), తుజాల శ్రీనివాస్ గౌడ్ (విశాల నేత్రం)సంయుక్త కార్యదర్శులు: బొంతల సత్యనారాయణ (సాక్ష్యం), కుస్తీ నారాయణ (నమస్తే తెలంగాణ) కార్యవర్గ సభ్యుడు: తుడుం పెంటయ్య (10 టీవీ).
ఎన్నికల పరిశీలకుడిగా కంది శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించగా, జిల్లా ఉపాధ్యక్షుడు పాతూరి రమేష్ గౌడ్, కోశాధికారి పూడెం దేవరాజు ఎన్నికల నిర్వహణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు నాగరాజుతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వెంకన్నకు మాదిగ దండోరా అండ



**ఎల్కతుర్తి అక్టోబర్ 25 జన వెలుగు దినపత్రిక రిపోర్టర్ కొలిపాక శ్రీనివాస్:** మాదిగ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడు సాతూరి వెంకన్న అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ ఆదివారం దామెర గ్రామంలో ఆయనను పరామర్శించారు. వెంకన్న ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భార్యాభర్తలిద్దరూ మాదిగ ఉద్యమంలో చేసిన కృషిని గుర్తుచేసి అభినందించారు వెంకన్నకు మెరుగైన వైద్యం అందించేందుకు నిమ్స్ వైద్యులతో మాట్లాడి అవసరమైన చికిత్స అందించాలని కోరినట్లు నాయకులు తెలిపారు .మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి సహకారంతో ప్రభుత్వం తరపున అవసరమైన వైద్య సాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. మాదిగ సమాజం వెంకన్న కుటుంబానికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వెంకన్నకు నిత్యావసర బియ్యం అందజేశారు. చికిత్సకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ సలహాదారు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొమ్ముల బాబు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు జనార్ధన్ కవ్వాంపల్లి రవి నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు..

# ఓట్ బచావో- దేశ్ బచావో ఉద్యమంపై కాంగ్రెస్ సమీక్ష

## నవంబర్ 1న ఢిల్లీలో మెగా ర్యాలీ.. భారీగా జన సమీకరణకు పిలుపు




**నాగర్ కర్నూల్ జిల్లా, అక్టోబర్ 25,జన వెలుగు రమణ :** కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఓట్ బచావో -దేశ్ బచావో' ఉద్యమంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉద్యమ పురోగతి, భవిష్యత్ కార్యాచరణ, రాబోయే నిరసన కార్యక్రమాలపై చర్చించారు.ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులు రవీంద్ర దాస్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సర్ ఇన్‌చార్జి సిద్ధేశ్వర, స్థానిక ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు.

**నవంబర్ 1న ఢిల్లీలో మెగా ర్యాలీ**
ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నవంబర్ 1న నిర్వహించ తలపెట్టిన 'ఓట్ బచావో -- దేశ్ బచావో' మెగా ర్యాలీని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా, బ్లాక్ స్థాయిల నుంచి కార్యకర్తలు, ప్రజలను పెద్ద సంఖ్యలో సమీకరించి ర్యాలీలో పాల్గొనేలా కార్యాచరణ చేపట్టాలని కోరారు.

**సుదీర్ఘ పోరాటానికి రాహుల్ గాంధీ పిలుపు**
ఈ ఉద్యమంపై ఏఐసీసీ నిర్వహించిన సమీక్షలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ఎన్నికల వ్యవస్థలో మార్పులు వచ్చే వరకు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు నిరసనలను నిరంతరాయంగా, ఉధృతంగా కొనసాగించాలని స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు.

# నూతన ఏఎంసీ డైరెక్టర్ భూక్యా చందర్ నాయక్‌కు ఘన సన్మానం.



**ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 26 జన వెలుగు న్యూస్ ప్రతినిధి ఒగ్గు మహేష్ యాదవ్**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన నూతనంగా ఎన్నికైన ఏఎంసీ డైరెక్టర్ భూక్యా చందర్ నాయక్‌ను ఎల్లారెడ్డిపేట మండల బంజారా సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బంజారా సంఘం మండల అధ్యక్షుడు భూక్యా దేవీలాల్ నాయక్, మండల సంఘం ఉపాధ్యక్షుడు దేవేందర్ నాయక్, బంజారా సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా రాజు నాయక్, జిల్లా సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి అజ్మీరా తిరుపతి నాయక్ పాల్గొన్నారు.అలాగే సర్పంచులు కళ్యాణ్ నాయక్, రాజు నాయక్, భూక్యా తిరుపతి నాయక్, మాజీ సర్పంచ్ పుణ్య నాయక్, మాజీ ఎంపీటీసీ రవీందర్ నాయక్, కైలాస్ నాయక్, రమేష్ నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొని నూతన ఏఎంసీ డైరెక్టర్‌ను అభినందించారు.

# గరిసెల సురేందర్ ముదిరాజ్‌కు ఘనంగా జన్మదిన వేడుకలు



**మేడ్చల్,అక్టోబర్ 25,జన వెలుగు దినపత్రిక,రిపోర్టర్ ప్రభాకర్ రెడ్డి :**
గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో సందడి నెలకొంది.మేడ్చల్ నియోజకవర్గం నుంచి వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేందర్ ముదిరాజ్‌కు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# అభివృద్ధి పనులకు నిధుల మంజూరు..

## ఈటల రాజేందర్‌కు కృతజ్ఞతలు



**మేడ్చల్,అక్టోబర్ 25,జన వెలుగు దినపత్రిక, రిపోర్టర్ ప్రభాకర్ రెడ్డి :**
మేడ్చల్ ఆర్‌యూబీ నుంచి రైలాపూర్ వరకు రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు, రైలాపూర్–గౌడవెల్లి బ్రిడ్జి నిర్మాణానికి హెచ్‌ఎండీఏ ద్వారా రూ.7.40 కోట్లు మంజూరు చేయించిన సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు గిర్మాపూర్, రైలాపూర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

MOVIE TIME



# కొత్త ఏడాదిలో సెట్స్‌పైకి మైథాలజీ మూవీ

రణబాలి సక్సెస్‌తో జోష్ మీదున్న విజయ్ దేవరకొండ హీరోగా హాయ్ నాన్న ఫేమ్ శౌర్యువ్ దర్శకత్వంలో ఓ మైథాలజీ థ్రిల్లర్ మూవీ రాబోతుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జనవరి నుంచి ప్రారంభం కానున్నట్లు వార్తలొస్తున్నాయి. పురాణాలకు నేటి కాలాన్ని ముడిపెడుతూ రివేంజ్ యాక్షన్ డ్రామాగా దీనిని రూపొందించబోతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ మూవీ ఓపెనింగ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. నవంబర్ నుంచి షూటింగ్ మొదలుపెట్టాలని ప్లాన్ చేశారు. కానీ రణబాలి, రౌడీ జనార్ధన షూటింగ్‌లు ఆలస్యం కావడంతో ఆ ఎఫెక్ట్ ఈ మూవీపై పడింది. మైథాలజీ రోల్ కోసం విజయ్ స్పెషల్‌గా మేకోవర్ కాబోతున్నట్లు సమాచారం. అతడి లుక్, క్యారెక్టరైజేషన్ గత సినిమాలతో పోలిస్తే చాలా భిన్నంగా ఉంటుందని అంటున్నారు. మైథాలజీ ఎపిసోడ్స్ హైలైట్‌గా ఉండబోతున్నట్లు సమాచారం.



# కీర్తి సురేష్ రికార్డు రెమ్యూనరేషన్

క్రైమ్ డ్రామా వెబ్‌సిరీస్ అక్క కోసం కీర్తి సురేష్ తీసుకున్న రెమ్యూనరేషన్ బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సిరీస్ కోసం ఈ తమిళ బ్యూటీ ఆరు కోట్ల పారితోషికం స్వీకరించినట్లు చెబుతోన్నారు. కీర్తి సురేష్ కెరీర్‌లో ఇదే హయ్యెస్ట్ అని టాక్ వినిపిస్తోంది. అక్క వెబ్‌సిరీస్ అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. యాక్షన్ రోల్‌లో కీర్తి కనిపించడం ఇదే మొదటిసారి. యాక్షన్ సన్నివేశాల్లో పర్‌ఫెక్షన్ కోసం కీర్తి గన్ షూటింగ్‌తో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో ట్రైనింగ్ కూడా తీసుకుంది. డైలాగ్ డెలివరీపై విమర్శలు వచ్చే అవకాశం ఉండటంతో హిందీ యాసను పర్‌ఫెక్ట్‌గా పలకడంలో శిక్షణ తీసుకొని ఈ సిరీస్‌కు డబ్బింగ్ చెప్పినట్లు ఆమె పేర్కొన్నది.



# అందుకే ప్రమోషన్లకు దూరమా?

రణబీర్‌కపూర్, సాయిపల్లవి జంటగా నటించిన రామాయణ మూవీ నవంబర్ 5న థియేటర్లలోకి రాబోతుంది. కేజీఎఫ్ ఫేమ్ యశ్ కీలక పాత్రలో నటిస్తోన్న ఈ సినిమాకు నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. రామాయణ గాథ ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్, సన్నీడియోల్, లారా దత్తాతో పాటు పలువురు బాలీవుడ్ యాక్టర్స్ ప్రధాన పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ మైథాలజీ మూవీలో యశ్‌కు జోడీగా కాజల్ అగర్వాల్ కనిపించబోతుంది. రన్‌టైమ్ సమస్యల కారణంగా ఈ మైథాలజీ మూవీ నుంచి కాజల్ అగర్వాల్ సీన్లను చివరి నిమిషంలో కట్ చేశారని వార్తలొస్తున్నాయి. మేకర్స్ నిర్ణయంతో హర్టయిన ఈ అందాల చందమామ కావాలనే రామాయణ ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటుందని అంటున్నారు. సోషల్ మీడియాలో ఈ సినిమాను ఉద్దేశించి ఎలాంటి పోస్టులు పెట్టడం లేదు కాజల్.



# గోపీచంద్ సరసన మలయాళ బ్యూటీ

గోపీచంద్ సింగ షూటింగ్‌పై మేకర్స్ అప్‌డేట్ ఇచ్చారు. యాక్షన్ రివేంజ్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ మూవీ షూటింగ్ సగం వరకు పూర్తయినట్లు వెల్లడించారు. ఫైట్ మాస్టర్ వెంకట్ డైరెక్టర్‌గా పరిచయమవుతోన్న ఈ సినిమాతో మలయాళ బ్యూటీ అనార్కలి నజర్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో గిరిజన తెగ పోరాటంతో సింగ రూపొందుతోంది. ఇందులో ట్రైబల్ తెగకు చెందిన యోధుడిగా గోపీచంద్ కనిపించబోతున్నట్లు సమాచారం. అనార్కలి నజర్ ఈ సినిమాతోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. మలయాళంలో ఆరాట్టు, మోహన్ కుమార్ ఫ్యాన్స్, రోమియోతో పాటు మరికొన్ని సినిమాలు చేసింది. సింగలో అనార్కలి ఓ డీ గ్లామర్ పాత్రలో కనిపించబోతున్నట్లు వార్తలొస్తున్నాయి.

# భర్తతో బాక్సాఫీస్ వద్ద పోటీ

భర్త నాగచైతన్యతో అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ బాక్సాఫీస్ వద్ద పోటీపడబోతుంది. ఒకే రోజు భార్యాభర్తల సినిమాలు థియేటర్లలోకి రాబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. తమిళంలో వెట్టువమ్ పేరుతో సైన్స్ ఫిక్షన్ కథతో తెరకెక్కుతోన్న సినిమాకు పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. నెగెటివ్ షేడ్స్‌తో యాక్షన్ ప్రధానంగా సాగే పాత్ర కోసం మల్ల ఖంభం, అది మురై కలరిపయట్టు వంటి ప్రాచీన యుద్ధ కళలను నేర్చుకుంది. ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. డిసెంబర్ 4ను రిలీజ్ డేట్‌గా ఫైనల్ చేసే అవకాశం ఉందని అంటున్నారు. అదే రోజు నాగచైతన్య వృషకర్మ థియేటర్లలోకి రాబోతుంది. ఒకే రోజు నాగచైతన్య, శోభిత ధూళిపాళ నటించిన వేర్వేరు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. భర్త సినిమాతో బాక్సాఫీస్ వద్ద ఫస్ట్ టైమ్ శోభిత పోటీపడబోతుండటం ఉత్కంఠను పంచుతోంది.

